# అసలు నిజం

**మా** ఊరి పోస్టుమాస్టర్ నాకు బాగా తెలుసు. ఉత్తరాలు కొనుక్కుని అతన్తో మాట్లాడుతూ కూర్చున్నాను.

ఎవరో ఒక వ్యక్తి.... గాలికి కదిలే టేకు ఆకులా పదునైన నిక్కరూ, శరీరానికి అతుక్కుపోయిన షర్టూ, పెరిగిన గడ్డంతో నో అడ్మిషన్ బోర్డును లెక్కచేయకుండా లోపలికి చొచ్చుకొచ్చాడు.

ఎగాదిగా చూశాడు పోస్టుమాస్టరతన్ని. అంతేకాదు. అతడందించిన తెల్లకాగితమ్మీద పోస్టాఫీసు ముద్రవేసి.... "ఇదిగో రఘువీర్!.... ఇక వెళ్ళు" అంటూ ఇచ్చేశాడు.

నా గుండె ఝల్లుమంది. తెల్లకాగితమ్మీద ముద్రవేయడమంటే బ్లాంకు చెక్కుమీద సంతకం బెట్టడమే గదా! అతడి వాలకం నాలో ఆసక్తి రేకెత్తించింది. మారు మాట్లాడకుండా రఘువీర్ వెంటవెళ్ళాను. కో ఆపరేటివ్ బ్యాంకులో దూరాడతడు-

అదే కాగితమ్మీద కో ఆపరేటివ్ బాంకు మేనేజర్ సంతకం చేసిచ్చాడు.

అక్కణ్ణుంచి గబగబా స్టేట్ బ్యాంకులోకి.... స్టేట్ బ్యాంకు క్యాషియర్ రామారావు సదరు కాగితాన్నందుకుని ఒక రూపాయి బిళ్ళ రఘువీర్ చేతుల్లో ఉంచాడు.

ఖుషీగా గడ్డం నిమురుకుంటూ నిష్క్రమించాడు రఘువీర్. క్యాషియర్ రామారావు నా ప్రాణ స్నేహితుడు.

"ఇదేం తమాషారా?" అడిగాను.

"వాడో పిచ్చోడురా! రోజూ పోస్టాఫీసు ముద్రా, కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ సంతకంతో కాయితం తెచ్చిచ్చి రూపాయి వసూలు చేసుకెళ్ళాడు. ఈ మూడు ఆఫీసుల్లో ఎవరైనా కాదూ, కూడదూ అంటే ఆ ఆఫీసులో హంగామా. ఆఫీసు రికార్డులు చెల్లాచెదరై పోతై, గొడవ జరిగి పోతుంది. ఫోన్ చేస్తే పోలీసులు కేర్ చెయ్యరు. ఎందుకొచ్చిన గొడవని అందరమూ అడ్జెస్టైపోయాం."

o o o

ఎరుదు చూస్తోన్న ప్రమోషన్ పైరవీ లేకుండా వచ్చినందుకు లక్షరూపాయల లాటరీ తగిలినంత సంతోషమైంది. ఆఫీసు స్టాఫ్‌కు యస్కేసి (స్వీటు, కారా, కాఫీ) సమర్పించుకుని ఇంటికొచ్చా.

మానస సరోవరంలో రాయంచలా వయ్యారంగా అడుగులేస్తూ ఎదురొచ్చింది నా శ్రీమతి మనోరమ.

"శ్రీవారి ముఖపద్మమీరోజు సెర్చిబల్బులా వెలిగిపోతుందేమిటీ?" భుజమ్మీద చెయ్యేసి గదిలోకి ఫాలో అయింది.

డ్రెస్ మార్చుకోవడంలో సంపూర్ణంగా సహకరిస్తూ, నా ఉద్యోగ పర్వంలో విజయకేతనం రెపరెపల గురించి వింది. విని సంతోషాన్నాపుకో లేక అమాంతం కౌగిలించుకుని, నా చెంపల్ని పెదాలతో తడిపేసింది.

"అబ్బా....ఇద్దరు పిల్లల తర్వాత నీ అందం ఐదు రెట్లు పెరిగింది మనోరమా!" దొండపండు పెదాలందుకోబోయాను. అరచేత్తో నా పెదాల నాపేసి-

"ఇప్పటికిది చాలు.... పిల్లలు వచ్చే వేళైంది" అని కాటుక కళ్ళను చక్రాల్లా తిప్పేసింది.

"అదేం కుదరదు...." విజృంభించబోయాను.

"ఎవరూ లేరా ఇంట్లో....?" అంటూ రామారావొచ్చాడప్పుడే.

వీడిప్పుడే రావాలా?....

మనోరమ గబగబా వెళ్ళి నా ప్రమోషన్ వార వాడి చెవిలో వేసింది, ఆలస్యమైతే కొంపలంటుకుపోతాయన్నట్టు.

"ఏరా మిత్రద్రోహీ! ఈ వార్త నిప్పటిదాకా దాచావు, ఏం బావు కుందామనుకున్నావురా?...." నిలదీశాడు.

"అంతేకాదు....వాడికీరోజు కూడుబెట్టకు చెల్లెమ్మా!" అంటూ ఆదే శాలు గూడా జారీ చేశాడు.

"నిన్ను ఆఫీసులో కలిసి, నేను మా ఆఫీసు కెళ్ళింతర్వాతనే ఈ వార్త తెలిసిందిరా.... అమ్మతోడు...." నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాల్సివచ్చింది.

పెద్ద ఉద్యోగంలో జాయినయ్యే ముందు జబల్‌పూర్‌లో మూడు నెలలు ట్రైనింగ్. ఎల్లుండే ట్రైనింగ్ క్లాసులో రిపోర్టు చెయ్యాలి. ఆర్డర్ చదివి....

"ఐతే.... పదా సిన్మాకు. మనం మళ్ళీ కలిసి సినిమా చూసే దెప్పుడో....!" అని సిన్మాకి లాక్కెళ్ళాడు.

సినిమా వదిలేసరికి తొమ్మిదైంది. సంగీతం, సాహిత్యం, నాట్యం సమపాళ్ళలో రంగరించిన రసగుళిక లాంటి సినిమా గురించి చర్చిస్తూ భోగేశ్వరాలయందాకా వచ్చాం.

పదిహేను నెలల క్రితం భోగేశ్వరాలయంలో జంటహత్యలు జరిగాయి. అందుకే రాత్రి సమయాల్లో ఆ రూట్లో ఎవ్వరూ నడవరు. కాని, మా ఇళ్ళకదే షార్ట్‌కట్. గబగబా నడుస్తున్నాం.

పున్నమిరోజది. పచ్చిపాలు ఆరబోసినట్టు తెల్లని వెన్నెల. కాకతీయుల కళాతృష్ణకు అద్దం పడుతున్న దేవాలయ ప్రాకారాలను మెరిపింపచేస్తున్న ఆ శుభ్రజ్యోత్స్నకాంతులకు వీధిలైట్ల వెలుగులు వెలవెలబోతున్నై.

విచిత్రం....దేవాలయంలోంచి వస్తోన్న సుమధుర సంగీతరవళి మా చెవులకు ఇంపుగా సోకింది. కాళ్ళకు బ్రేకులు పడినై. అప్రయత్నంగా లోపలికెళ్ళాం....ఆశ్చర్యం....అద్భుతం!

చల్లని వెన్నెలలో విశాలమైన మంటపం మీద, కాలుమీద కాలేసుకుని రఘువీర్ గొంతెత్తి సంగీత సరస్వతికి నీరాజనా లర్పిస్తున్నాడు.

మమ్మల్ని చూడగానే దిగ్గున లేచి కూచున్నాడు.

"నువ్వా రఘువీర్....?! ఐతే....నువ్వు పిచ్చాడివి కావన్నమాట?!" అడిగాడు రామారావు ఉద్వేగంగా.

రఘువీర్ శూన్యదృక్కులు ఆకాశంవైపు మళ్ళినై.

"హేయ్ రామ్!" గట్టిగా ఊపిరి వదుల్తూ స్తంభాని కొరిగాడు.

"మీరెవరూ?.... ఈ ఊళ్ళో ఎందుకుంటున్నారూ?" అడిగాను ఆసక్తిగా.

మావైపు మళ్ళిన అతని దృష్టి వెనక ఎన్నో అగాధాలున్నట్టనిపించింది.

ఇద్దరం కూచుండిపోయాం.

"నా సంగతి మీకెందుకూ?" అన్నట్టుగా చూశాడు.

"ప్లీజ్, చెప్పండి. మీకు పిచ్చిలేదు గదూ?" అభ్యర్థనగా అడిగాడు రామారావు.

"పూర్వం మాదీవూరే బాబూ!" రఘువీర్ గొంతులో గాంభీర్యం....

"నరరూప రాక్షసులైన రజాకార్ల చిత్రహింసలను భరించలేక మా తాత, నాన్నలీ ఊరుడిచి కాశ్మీర్ వెళ్ళారు. నేనప్పుడు చిన్నపిల్లవాణ్ణి. అదివరకే కాశ్మీర్లో స్థిరపడిన మా బంధువుల సహాయంతో మా నాన్న చిల్లరకొట్టు పెట్టాడు.

కాశ్మీర్ మహారాజు పుణ్యమాని అక్కడి ప్రజల్తో మేమూ కూడూ గుడ్డకు కొదవలేకుండా గడిపాం. తాత మరణించాడు. కాశ్మీర్ భారత్‌లో విలీనమైం తర్వాత మా కష్టాలు ప్రారంభమైనై. పాకిస్తాన్ మానస పుత్రుల ఆగడాలెక్కువైనై.

హిందువుల ఇళ్ళమీద దాడులు, దొంగతనాలు ఎక్కువైనై. హిందువులు దోపిడీలకు గురైనారు. రానురాను అత్యాచారాలు, మాన భంగాలు నిత్యకృత్యాలైపోయినై.

ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రోజులు గడుపుతున్నా తీవ్రవాద రాకాసి మూకలు పట్టపగ్గాలు లేకుండా విజృంభించాయి. పట్టపగలు నడి బజార్లో హత్యలు, చిత్రహింసలు, గృహదహనాలు మామూలైనై.

అంతెందుకూ.... కాశ్మీర్ లోయలో మన త్రివర్ణ పతాకమెగరదు. అసలక్కడ మమ్మల్ని అదుకునే నాథుడే లేడు. లక్షలాది మంది గాయా లతో ఆస్తిపాస్తులొదిలేసి పారిపొయ్యొచ్చారు. ఢిల్లీ పేవ్‌మెంట్ల మీద అడుక్కుతింటున్నారు. పోలీసుల లాఠీ దెబ్బలు భరించలేక ఎటెటో పారిపోతున్నారు.

ఓ రోజు.... మా ఇంటిమీద దాడి జరిగింది. మా నాన్న కాళ్ళూ చేతులు నరికేశారు. నా కళ్ళముందే నా భార్య మర్మావయవాల్లో కత్తులు దించారు. నా కూతుర్ని దారుణంగా చెరచి, ఆమె స్తనాలు కోసిపారేశారు.

వారంతా రక్తపుమడుగుల్లో కొట్టుకుంటూ పెట్టిన పెడబొబ్బలూ, చేసిన హాహాకారాలూ, చూసిన చూపులూ....నా గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలైనై. అవిప్పటికి నా కళ్ళముందు సినిమా రీళ్ళలా తిరుగుతున్నై.

పారిపోయి వస్తూ వెనక్కు తిరిగి చూస్తే నా ఇంట్లోంచి మంటలు లేస్తున్నై.

ఢిల్లీ పేవ్‌మెంట్లమీద రెండు నెలలు దుర్భర జీవితం గడిపాను. ఈ ఊరు గురించీ, ఈ భోగేశ్వరాలయం గురించీ మా తాతా, నాన్నా చెప్పేవారు. రైలెక్కి కాజీపేటలో దిగాను. ఇటువైపొస్తున్న ఓ లారీ డ్రైవర్ని బ్రతిమాలి ఇక్కడ దిగాను."

అతని కళ్ళల్లోని విషాదరేఖలు మమ్మల్ని కదిలించినై. మా కడుపుల్లో దేవినట్టయింది. రక్తం సలసల కాగింది.

"ఐతే....ఏదన్నా కష్టంజేసుకొని బతకొచ్చుగదా? ఎందుకా పిచ్చి నటన?" అడిగాడు మనోహర్.

"నా సత్తువంతా ఢిల్లీ ఉపవాసాల్తో కరిగిపోయింది. క్షణక్షణం నా భార్యాబిడ్డలు గుర్తుకొస్తే నాకు పిచ్చెక్కిపోతుంది. నా ఒక్క జానెడు పొట్టకు హోటల్ యజమానులువేసే ముద్దసరిపోతుంది. మీరీ రహస్యాన్ని బయటపెడితే నాగతి అధోగతే బాబూ!" రెండుచేతులెత్తి నమస్కరించాడు.

మూణ్ణెళ్ళ ట్రైనింగ్ పూర్తయి రెక్కలు కట్టుకుని ఇంట్లోవాలాను.

"ఆ మిత్రద్రోహి రామారావుగా డెప్పుడన్నా ఇటువైపొచ్చాడా? వెధవ - నేను వెళ్ళగానే ఒకే ఒక ఉత్తరం రాసి ఊరుకున్నాడు. నేనెన్ని ఉత్తరాలు రాసినా జవాబివ్వలేదు. అసలు వాడికేమైందంటా?" భోంచేస్తూ అడిగాను శ్రీమతిని.

"దొంగనోట్ల మార్పిడి కేసులో రామారావన్నయ్య హస్తముందని పోలీసులు అరెస్టు చేశారండీ!" చారు వడ్డిస్తూ చెప్తూంది మనోరమ.

"వాడెవడో సి.ఐ.డి. ఆఫీసర్ రఘువీరటా........పిచ్చోడివేషంలో తిరుగుతూ పట్టేశాడటా. అన్నట్టూ....భోగేశని గుళ్ళో జంట హత్యలు చేసిన దోషుల్ని గూడా వాడే పట్టాడటండీ! వాడెంత తెలివైనవాడో...."

(అమృత్‌కిరణ్ కథల పోటీలో బహుమతి పొందిన కథ)

(16-4-1995 అమృత్ కిరణ్ పక్షపత్రిక)